క్లుప్తంగా

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బాల్కొండ: మండల కేంద్రంలోని లింగమయ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో నిత్య పూజలు, కలష ప్రతిష్ఠాపన, హోమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. అనంతర అన్నదానం ఉంటుందన్నారు.

తపాలా పథకాలపై అవగాహన

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని తపాలా శాఖలో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ గురించి బుధవారం సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సబ్ పోస్ట్‌మాస్టర్ రమాదేవి, పోస్టల్ ఏవో మధుసూదన్, సిబ్బంది సాయ రెడ్డి, చంద్ర గౌడ్ పాల్గొన్నారు.

నందిపేట్(ఆర్మూర్): తపాల బీమా పాలసీ గురించి మండల కేంద్రంలో ప్రజలకు సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజన్ ఏవో గోల్కొండ శ్రీనివాస్, నందిపేట సబ్‌పోస్టు మాస్టర్ బ్రహ్మానందం, సిబ్బంది గంగాధరగౌడ్ పాల్గొన్నారు.

కాల్వలను శుభ్రం చేయాలి

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని బర్కత్‌పుర కాలనీలో మురికి నీరు చేరి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని, మురికి కాల్వలు శుభ్రం చేయించాలని కోరుతూ బుధవారం కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కాలనీ అంతా చెత్త చెదారంతో నిండి ఉందన్నారు. గతంలో డెంగీ సోకి 10 ఏళ్ల బాలిక మృతి చెందిందని గుర్తు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



ఆర్మూర్‌టౌన్: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఆర్మూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దుర్గారెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్రాక్ స్యూట్‌లు, బ్యాగులు, పరీక్ష ప్యాడ్‌లు, బెల్ట్‌లు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్ షీట్ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై సంవత్సరానికి రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తూ ప్రయివేటుకు దీటుగా ఉన్నత విద్యను అందిస్తుందని పేర్కొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ శ్రీకాంత్ బుధవారం తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు ప్రసవ సమయంలో అంబులెన్స్‌లోనే ఆస్పత్రికి తరలించేలా క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. వైద్య సేవల రికార్డులను పరిశీలించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



వర్ని: బడా పహాడ్ పుణ్యక్షేత్రం వద్ద పారిశుధ్య పనులను వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. ఈ నెల 2 నుంచి మూడు రోజులపాటు ఉరుసు జరగనున్న దృష్ట్యా పుణ్యక్షేత్రం వద్ద మురికి కాలువలను, వాగులను, రోడ్లను శుభ్రం చేయించారు. ఉరుసుకు వచ్చే భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేయాలని వక్ఫ్ బోర్డ్ సిబ్బందికి పంచాయతీ సిబ్బందికి సూచించారు.

దూదిగాంలో వరి పంటలు..

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో వరి పంటను భీంగల్ ఏడీఏ మల్లయ్య బుధవారం పరిశీలించారు. వరికి ఆశిస్తున్న మొగిపురుగు, అగ్గి తెగులు నివారణ కోసం చేపట్టాల్సిన నివారణ చర్యల గురించి వివరించారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి రాజు కుమార్, రైతులు ఉన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు

రెంజల్(బోధన్): సాటాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ ఎఖార్ పాష ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అహ్మద్, గ్రామస్తులు సాయిలు, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి తవ్వకం

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో శివాలయం వద్ద జెడ్పీటీసీ నిధులతో చేపడుతున్న బోరు తవ్వకానికి జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, సర్పంచ్ జక్క మల్లుభాయితో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఆనంతరం బోరు బావిని తవ్వించారు. ఉప సర్పంచ్ జక్క గంగాధర్, పీఏసీఎస్ చైర్మన్ జక్క రాజేశ్వర్, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

వంద శాతం వసూలే లక్ష్యం

- ఆర్మూర్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఇంటి పన్ను వసూలు
- 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాల్లో వంద శాతం పన్నుల వసూళ్లతో రికార్డు



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

ఆర్మూర్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల వసూళ్లకు సిబ్బంది సమష్టి కృషితో పని చేస్తున్నారు. 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరాల్లో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మున్సిపాలిటీగా సాధించిన రికార్డును సొంతం చేసుకున్న రికార్డును తిరిగి పొందడమే లక్ష్యంగా 2023 మార్చి నెలాఖరులోగా వంద శాతం పన్నుల వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మనోహర్ ఉన్నతాధికారుల సూచన మేరకు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీతతో పాటు మున్సిపల్ కౌన్సిలర్ల సహకారంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ పన్నులు వసూలు చేస్తున్నారు.

పట్టణంలో 56.14 శాతం పన్ను వసూలు..

ఆర్మూర్ పట్టణంలో విలీన గ్రామాలైన పెర్కిట్–కొటార్మూర్, మామిడిపల్లిలను కలుపుకొని 19 వేల ఇళ్లు ఉండగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.4 కోట్ల 72 లక్షల పది వేలను ఇంటి పన్నుల రూపంలో వసూలు చేయాల్సి ఉంది. అయితే జనవరి నెలాఖరు నాటికి రూ.2 కోట్ల 65 లక్షల 6 వేలు వసూలు చేశారు. మిగిలిన రూ.2 కోట్ల 7 లక్షల 4 వేలను మార్చిలోగా వసూలు చేయడానికి మున్సిపల్ సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. అప్పటికి స్పందించకుండా ఇంటి పన్ను చెల్లించని వారి ఇంట్లో వస్తువులను జప్తు చేయడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు.

సమష్టి కృషితో సాధిస్తాం



మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం పన్నులు వసూలు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. మున్సిపల్ సిబ్బంది, పాలకవర్గం సమిష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుంది. ప్రజల్లో సైతం పన్నుల చెల్లింపుపై అవగాహన పెరిగింది. ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ ఏడాది పన్నుల వసూలు ప్రక్రియ పూర్తి చేస్తాం.

–మనోహర్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్, ఆర్మూర్

పన్ను చెల్లింపు బాధ్యత ప్రజలదే



పట్టణ ప్రజలు ఆర్మూర్ మున్సిపాలిటీని ఉన్నతంగా నిలపడానికి అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు. అందుకే పన్నుల చెల్లింపును బాధ్యతగా భావించి ప్రతీ ఒక్కరూ పన్నులు చెల్లిస్తున్నారు. వంద శాతం ఇంటి పన్నుల వసూలు ప్రక్రియ పూర్తి చేసి హాట్రిక్ కొట్టాలనే లక్ష్యంతో పని చేస్తున్న సిబ్బందికి సహకరించాలి.

– పండిత్ వినీత, మున్సిపల్ చైర్ పర్సన్

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

రెంజల్(బోధన్): ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని బోధన్ వ్యవసాయ సంచాలకుడు సంతోష్ అన్నారు. బుధవారం ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. కల్యాపూర్‌లో వరి పంటను పరిశీలించారు. వరిలో మొవ్వ ఉన్నట్లు గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రెంజల్‌లో పెస్టిసైడ్ దుకాణంలో స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. ఈ–పాస్ మెషిన్ పద్ధతి ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. రెంజల్ రైతు వేదికలోని కార్యాలయంలో పంటల నమోదు పూర్తి చేయాలని ఏవోకు ఆదేశించారు. దూపల్లి విండో ఎరువుల గోదాంను పరిశీలించారు. వ్యవసాయాధికారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రసాద్‌లు ఉన్నారు.

ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెర్కిట్(ఆర్మూర్): నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌పై ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆర్మూర్ మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ నాయకుడు కంచెట్టి గంగాధర్ అన్నారు. పెర్కిట్‌లో బుధవారం గంగాధర్ మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రైతుల సంక్షేమం కోసం గత ఎంపీ కవిత చేసిన దాని కంటే నాలుగు రెట్లు ఎక్కువ చేశారన్నారు. అలాగే స్పైసెస్ బోర్డు నుంచి రూ.38 కోట్లు మంజూరు చేయించిన ఘనత ఎంపీ అర్వింద్‌దేనన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎంపీ అర్వింద్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆర్టీసీ ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టాం

- రీజనల్ మేనేజర్ ఉషాదేవి



బస్సులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి, డీఎం టీఎస్ స్వామి తదితరులు

బోధన్: ఆర్టీసీ ఆదాయ వృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని ఆర్టీసీ ఆర్‌ఎం ఉషాదేవి అన్నారు. సాధ్యమైనంత మేరకు అధిక ఆదాయం వచ్చే మార్గాల్లో కొత్త బస్సులను ఆపరేట్ చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. బుధవారం బోధన్ ఆర్టీసీ డిపోకు ప్రభుత్వం అందించిన రెండు సూపర్ లగ్జరీ బస్సులను స్థానిక డీఎం టీఎస్ స్వామితో కలిసి ప్రారంభించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ.. జిల్లాకు మొత్తం 50 కొత్త సూపర్ లగ్జరీ బస్సులు రానున్నాయని, ఇప్పటికే 16 బస్సులు రాగా, ఆయా డిపోలకు కేటాయించినట్లు తెలిపారు. బోధన్ నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులను హైదరాబాద్, ఒంగోలుకు నడపాలని నిర్ణయించామని వెల్లడించారు. ఎయిర్ సస్పెన్షన్, సీసీ కెమెరాలు, ఫైర్ అలారం, ఆడియో, వీడియో సౌకర్యం, పుష్‌బ్యాక్ సీట్లు సూపర్ లగ్జరీ బస్సు ప్రత్యేకతలను వివరించారు. బోధన్ బస్టాండ్‌లో టాయిలెట్స్‌ను ఉచితంగా వినియోగించుకునేందుకు అనుమతిచ్చినట్లు తెలిపారు.

ప్రత్యేక జిల్లా కోసం దీక్షలు



బోధన్ : బోధన్‌ను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా, రెవెన్యూ డివిజన్ పునర్విభజన సమయంలో ఎంతో చారిత్రిక ప్రస్థానం కలిగిన బోధన్‌ను విస్మరించడం బాధాకరమని పేర్కొన్నారు. న్యాయవాదుల ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని తెలిపారు. ప్రత్యేక జిల్లా సాధన కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 45వ రోజుకు చేరాయి.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో సుదర్శనం సూచించారు. నవీపేట, అభంగపట్నం గ్రామాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు శిబిరాలలో ఇప్పటి వరకు 76,511 మందికి కంటి పరీక్షలు చేశామని పేర్కొన్నారు.

రుద్రూర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి శిబిరాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీవో బాల గంగాధర్ కోరారు. రుద్రూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి పరీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

జీపీ భవనాలకు నిధులు

బోధన్: నియోజకవర్గంలోని 26 జీపీ భవనాల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖ నిధులు మంజూరు చేసిందని స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ బుధవారం తెలిపారు. బోధన్ మండలంలోని రాజీవ్‌నగర్ తండా, బిక్నెల్లి, ఫత్తేపూర్, పెంటాకుర్దు క్యాంప్, బండారుపల్లి, సాలంపాడ్ క్యాంప్, అమ్దాపూర్, బర్దీపూర్, ఎరాజ్‌పల్లి, హంగర్గ, ఖాజాపూర్, ఊటీపల్లి, సంగం, నవీపేట మండలంలోని స్టేషన్ ఏరియా, ఆశాజ్యోతికాలనీ, గాంధీనగర్, మట్టయ్యఫారం, అభంగపట్నం, బినోల, జన్నేపల్లి, మద్దెపల్లి, రెంజల్ మండలంలోని బొర్గాం, మౌలాలి తండా, దండిగుట్ట, వీరన్నగుట్ట, ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల చొప్పున రూ.5 కోట్ల 20 లక్షలు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. బోధన్, ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల్లోని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం క్రింద రూ.14 కోట్ల 20 లక్షలు మంజూరయ్యాయని వెల్లడించారు.

ఆరెకటికలను ఆదుకోవాలి



నందిపేట్(ఆర్మూర్): మటన్ దుకాణాల నిర్వహణను ప్రభుత్వం ఏర్పాటు చేస్తామనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ బుధవారం నందిపేట తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు ఆరెకటిక కులస్తులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సెంటర్ల ఏర్పాటు వల్ల తాము జీవన ఆధారం కోల్పోయి ఉపాధి కరువవుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఆరెకటిక కులసంఘం సభ్యులు గోలికారి యాదిలాల్, న్యాంతాబాద్ ఓంకార్, లక్ష్మణ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఎగరాలి కాషాయ జెండా' ఆడియో ఆవిష్కరణ



నందిపేట్(ఆర్మూర్): హిందూ ధర్మం ఔన్నత్యం గురించి పాట రాయడం అభినందనీయమని కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ అన్నారు. బుధవారం నందిపేటలో జరుగుతున్న అఖిలాంధ్ర సాధు పరిషత్తు మహాసభలో 'ఎగరాలి ఎగరాలి కాషాయ జెండా' అనే ఆడియో క్యాసెట్‌ను మంగిరాములు మహారాజ్ ఆవిష్కరించారు. రచయిత, గాయకులు కర్క రమేష్ స్వతహాగా రాసి పాడిన ఆడియో క్యాసెట్ రూపొందించడం అభినందనీయమన్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండండి



మాట్లాడుతున్న వర్ని ఎస్సై అనిల్ రెడ్డి

వర్ని/బోధన్ టౌన్/బాల్కొండ: సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్ని ఎస్సై అనిల్ రెడ్డి , బోధన్ పట్టణ సీఐ ప్రేమ్ కుమార్, మెండోరా పోలీసు స్పిబ్బంది సూచించారు. బుధవారం వర్ని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో, బోధన్ పట్టణంలోని చైతన్య వొకేషన్ కళాశాలలో, మెండోరా మండల పోచంపాడ్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఫోన్లలో అనవసరమైన యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, ఇతరులకు ఓటీపీలను చెప్పొద్దని, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు చెప్పరాదని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. ఎవరైనా మోసపోతే పోలీస్ స్టేషన్‌లో లేదా 100కు ఫిర్యాదు చేయాలని, ఈ విషయాలపై తల్లిదండ్రులకు కూడా విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు.

ఏకచక్రేశ్వర మందిరం చైర్మన్‌గా బీర్కూర్ శంకర్



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే షకీల్

బోధన్‌టౌన్(బోధన్): ఏకచక్రేశ్వర మందిరం చైర్మన్‌గా నియమితులైన బీర్కూర్ శంకర్(బుజ్జి)కు ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా లక్ష్మణ్ పటేల్, రుద్రసత్యం, గుమ్ముల శంకర్ రెడ్డిలని నియమించారు. ఆలయ అభివృద్ధికి, సంస్కృతీ సాంప్రదాయాలకు కట్టుబడి భక్తులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందిస్తానని బీర్కూర్ శంకర్ అన్నారు. నాపై నమ్మకం ఉంచి ఆలయ కమిటీ చైర్మన్ బాధ్యతలను అప్పగించిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

ఏసీడీ బిల్లులు రద్దు చేయాలని ధర్నా



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

మాక్లూర్: ఏసీడీ పేరుతో అదనంగా వసూలు చేస్తున్న బిల్లులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ వినియోగదారులు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కొండ గంగాధర్ మాట్లాడుతూ.. గతంలో 2 మాసాలకు ఒకసారి వసూలు చేసే విద్యుత్ బిల్లులను కొంత కాలంగా నెలవారీగా వసూలు చేయటంతో పేదలు చెల్లించటానికి అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఏసీడీ బిల్లులు వినియోగదారులపై మోపడం మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఏసీడీ బిల్లుల వసూలును నిలిపి వేయించాలన్నారు.

ఎండీఎం కార్మికుల సమస్యల్ని పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఆర్మూర్‌టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎండీఎం కార్మికులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండీఎం కార్మికులు మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగులో ఉన్న బిల్లులు చెల్లించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలు ఇవ్వాలన్నారు. ఎండీఎం కార్మికులు సుజాత, కవిత, శ్యామల, గంగామణి, ప్రవంతి, సత్తవ్వ పాల్గొన్నారు.

వీర బ్రహ్మేంద్రస్వామి రథ సంప్రోక్షణ కార్యక్రమం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి రథ సంప్రోక్షణ వీడీసీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించే జాతర కోసం తయారు చేయించిన రథాన్ని గ్రామం నుంచి మహిళల మంగళ హారతులు, భాజా భజంత్రీల మధ్య శివారులోని బ్రహ్మంగారి గుట్ట వద్దకు శోభాయాత్రగా తీసుకెళ్లారు. అనంతరం బ్రహ్మంగారి మఠం ఆస్థాన సిద్ధాంతులతో సంప్రోక్షణ కార్యక్రమం జరిపించారు. బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ కమ్మర్‌పల్లికి వచ్చి వీర బ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ సుధాకర్, వీడీసీ అధ్యక్షుడు బద్దం రాజేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కొడ నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో



కోటగిరిలో ఆందోళన చేస్తున్న ప్రజలు

కోటగిరి : తమకు కొన్నాళ్లుగా మిషన్ భగీరథ తాగు నీరు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ బుధవారం కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వాసులు రుద్రూర్– పోతంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. భగీరథ నీటిని రోజుకు రెండు పూటలు ఇవ్వాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేసినా, ఒక్కో వ్యక్తికి 100 లీటర్లు మాత్రమే అంటూ అధికారులు చెబుతున్నారని, ఇంటి అవసరాలకు ఈ నీరు ఏవిధంగా సరిపోతుందని ప్రశ్నించారు. గృహావసరాలకు ఇంకా బోర్లపైనే ఆధారపడాల్సి వస్తోందని వాపోయారు. ఈ సమస్యపై 'సాక్షి' పంచాయతీ కార్యదర్శి గడ్డం రాజేందర్‌ను వివరణ కోరగా డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టుకునే కొందరు వ్యక్తులు నల్లాలకు మోటార్లను బిగించడం వల్ల నీటి సమస్య తలెత్తిందని, నీటి సరఫరా సమయంలో కరెంట్ నిలిపేసేలా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు.

4న వర్నిలో భగత్ సింగ్ మెమోరియల్ పోటీలు

వర్ని: భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఈనెల 4, 5 తేదీలలో భగత్ సింగ్ మెమోరియల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం వర్ని ఏరియా కమిటీ అధ్యక్షులు నడిపింటి కార్తీక్ వెల్లడించారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలను రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు చెప్పారు

నిధుల మంజూరుపై హర్షం



మాక్లూర్(ఆర్మూర్): వెంకటాపూర్ గ్రామానికి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, స్థానిక ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి గ్రామ సర్పంచ్ భవాని రఘు కతజ్ఞతలు తెలిపారు. కొన్ని రోజుల క్రితం వారిని కలిసి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కోరారు. ఇప్పుడు నిధులు మంజూరు చేయడంతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిస్థాయిలో చేపడతామని భవాని తెలిపారు.

కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి



బహుమతులు అందిస్తున్న ఎంఈవో గణేశ్ రావ్



గ్రాండ్ పేరెంట్స్‌డేలో పాల్గొన్న వృద్ధులు, విద్యార్థులు

రెంజల్(బోధన్): పతనమవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని ఎంఈవో గణేశ్ రావ్ అన్నారు. కుటుంబంలోని పిల్లలకు నైతిక విలువలు నేర్పిస్తేనే బాధ్యతలు గుర్తిస్తారని వివరించారు. ప్రస్తుత సమాజంలో కుటుంబంలో రాజకీయాలు పెరగడంతో వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సాటాపూర్ ఉషశ్రీ పాఠశాలలో బుధవారం గ్రాండ్ పేరెంట్స్‌డే దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పెద్దలను గౌరవించుకునే సంప్రదాయం నేటి యువతకు ఆస్తులుగా అందించాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పిల్లలతో అమ్మమ్మ, తాతయ్యకు పాదాభివందనం చేయించారు. విద్యార్థులకు బహుమతులను అందించారు.

పనులను రికార్డుల్లో నమోదు చేయాలి

ఎడపల్లి(బోధన్): కార్యదర్శులు గ్రామాలలో చేసిన పనులను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని జెడ్పీ సీఈవో గోవింద్ సూచించారు. బుధవారం పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్ పాల్గొన్నారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి

నవీపేట: స్టేషన్ ఏరియా తండాకు చెందిన రవిపై అదే తండాకు చెందిన మహేష్ మంగళవారం రాత్రి సీసాతో దాడి చేశాడని ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. పాత కక్షల నేపథ్యంలోనే మహేష్ ఈ దాడికి పాల్పడ్డాడని, బాధితుడి ఫిర్యాదు మేరకు మహేష్‌తో పాటు తల్లి మంజుల, స్నేహితుడు సంజుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రైతులకు డ్రమ్ముల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో రైతులకు ఐసీఐసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీపై నీటి డ్రమ్ములను బుధవారం పంపిణీ చేశారు. 26 మంది రైతులకు 200 లీటర్ల ప్లాస్టిక్ డ్రమ్ములను అందజేశారు.